

# వదిన

పి.యస్. నారాయణ

గుంటూరులో ఆ సాయంకాలపు ఎండ చంద్రశేఖరాన్ని భార్య రాజేశ్వరి మాటల్లా చాదికొడుతుంది.

నిజమే ! ఆమె బాధ ఆమెది...

— తన ఆఖరి చెల్లెలి పెళ్ళికి భర్తతోసహా వెళ్ళకపోవటం ఆమెకు చిన్నతనమే అవ్వొవచ్చు.

కాని, అలా వెళ్ళిపోవటానికి కారణం మాత్రం చిన్నదా ?

ఇంకోగంటలో పెళ్ళికి ప్రయాణమనగా తన ఊరినుంచి టెలిగ్రాం వచ్చింది.

"బ్రదర్ ఎక్స్పైర్డ్ ... స్టార్ట్ యిమీడియట్లీ !"

స్వంత అన్నయ్యాపోగా తను రాజేశ్వరి మాటల్లోలా పెండ్లికివెళ్ళి నలు

గురిలో నవ్వుతూ ఎలా తిరగ గలుగు తాడు.

—డబ్బున్న రాజేశ్వరికి ఏంవీలేని బడిపంతులు - తన అన్నయ్య ఒక లెక్కా? తన చెల్లెలు పెళ్ళిముందు ఆయన చావు ఏపాటిది?

ఏదో బస్సు మనుష్యుల మీ ద కు ఎక్కుతున్నట్లుగానే వచ్చి స్టేజీలో ఆగింది. బ్రీఫ్ కేసును చేతిలోకి తీసు కొని నలుగురితోబాటు చంద్రశేఖరమూ బస్కు ఎక్కే ప్రయత్నంలో పడ్డాడు.

అతడి మనస్సంతా చికాగ్గా వున్నది. ఎయిర్ కండిషన్డ్ గదుల్లో కూర్చునే అతనికి ఆ ఎండలో చెమట మరింత చికాకు కలిగిస్తోంది. ఎప్పుడూ చిన్న కార్లలోనే తిరిగే అతడిని ఆ ఆర్టీసి వారి ఎర్రబస్సు చికాకు కలిగిస్తోంది. సూట్లతో తిరిగే మనుష్యులతో తిరిగే అతడికి ఆ బస్సుల్లో తిరిగే ప్రయాణీకులు చికాకు కలిగిస్తున్నారు — రాజేశ్వరి కారుతీసుకు వెళుతూ తన ముఖాన విదిలించికొట్టిన నాలుగుమాటలూ అతడిని మరింత చికాకు కలిగిస్తున్నాయి.

అంతా చికాకు ... చికాకు ...

అన్నయ్యపోయాడు ...

కండెక్టర్ డబ్బులు తీసుకొని టిక్కెట్టు పంచ్ చేశాడు.

కూలింగ్ గ్లాసెస్ కళ్ళకు తగిలించేసుకున్నాడు చంద్రశేఖరం - ఆ ఎండనూ, మనుష్యులనూ చూడ లేనట్లుగా!

ఎక్స్‌ప్రెస్‌లో ఇంకాస్త హాయిగా వెళ్దామనుకున్నా ఆ బస్సు ఆగి చావని వూరు తనది!

కండెక్టర్ గంటకొట్టాడు.

రాజేశ్వరి తనని వరండాలో తన దుఃఖంలో తనని వంటరిగా వదిలివేసి - పిల్లల్ని తీసుకొని - కారు డోరును తన ముఖంమీదకు కొట్టినట్లుగా వేసుకొని వెళ్ళిపోయింది.

— ఆమె తండ్రి లక్షల కధికారి మరి!

తను చాలా దీనంగా - ఎవరినో దేబిరించి అడిగినట్లుగా అడిగాడు — "నన్ను మన్నించు రాజేశ్వరీ! ... జీవితంలో ఈ ఒక్కసారీ నన్ను క్షమించు ... చచ్చిపోయింది నా స్వంత అన్నయ్య ... నన్ను అక్కడకు వెళ్ళ నీయ్ ... వెళ్ళి చివరిసారిగా ఆయన శవాన్నయినా చూడనీయ్! ... "

డ్రైవర్ ఏదో స్టేజీలో బస్సు ఆపితే రాజేశ్వరిని చూచినంత అసహ్యంగా చూచాడు చంద్రశేఖరం అతడిని.

ఆమె కంఠం ఖంగుమన్నది: "స్వంత అన్నయ్యట ... స్వంత అన్నయ్య ... మా మామయ్యకు మీరు ఎప్పుడు దత్తువచ్చారు, అప్పుడేపోయింది మీకూ వాళ్ళకు చుట్టరికం... అన్నయ్య లేడూ, కన్నయ్యలేడూ ... "

శూన్యంలోకి డీలాపడిపోయి చూస్తున్నట్లుగా చూస్తూ రెండు నిముషాలు అలాగే అవాక్కయి నిలబడిపోయాడు ఆమె సిద్ధాంతానికి

చచ్చిపోయిన అన్నయ్య ఆరడుగుల విగ్రహం కళ్ళముందు కదలాడుతోంది. తల్లిలేని తనను తల్లిలా పెంచిన వదిన రూపాయంతబొట్టుతో కళ్ళముందు తారట్లాడుతోంది. "బాబాయ్...బాబాయ్!... అంటూ తిరిగే అన్నయ్య పిల్లలు కళ్ళముందు ఎగురుతూ కనబడ్డారు.

ఎంతో ఆత్మీయులయిన వాళ్ళకూ — తనకూ నడుమ — ఈనాడు రాజేశ్వరి ఒక అగాధంలా నిలబడివున్నది. తన సౌఖ్యంకోసరం, తన ఉన్నతికోసరం అన్నయ్య దత్తుఅనే రాచబాట ఏర్పరిస్తే అది తమ నడుమ లోతైన కాలువే అవ్వగా - రాజేశ్వరీ, వాళ్ళమామయ్యల డబ్బు అందులో నీళ్ళలాపారి తనకి ఇక ఎన్నడూ ఆ కాలువను దాటనీయకుండానే చేస్తున్నయి.

తనకు తెలును _ ఈ దత్తు అనే తంతులో తన స్వాతంత్ర్యాన్ని ఎలా కోల్పోవాలో ... అందుకే అలా జరగకుండా వుండేటందుకు ఎంతగానో ప్రయత్నించాడు - ఊఁహూఁ ...

తన జీవితం ఏలాంటి పంజరంలో బంధింపబడిందీ అని అనుకుంటే మరింత నీరసమొచ్చింది - ఆ అందమైన బంధిఖానానుండి తాను తప్పించుకోనే లేడా?

రాజేశ్వరి వెళుతూ వెళుతూ కసినంతా తన నెత్తిన కుమ్మరిస్తున్నట్లుగా అన్న మాటలు గుర్తుకు వచ్చినయి.

"ఇదుగో నేను చెబుతున్నాను వినండి ... ఈ డబ్బులేని వాళ్ళనందరినీ నేను కాచి, వడపోశాను ... మీరు ఆయనకు తమ్ముడని ఆ టెలిగ్రాం ఇవ్వలేదు ... వస్తూ వస్తూ ఓ సంచీడు రూపాయిలు పట్టుకువస్తే ఆ కర్మకాండంతా పూర్తిచేద్దామనే ఉద్దేశ్యంతో - అన్నా తమ్ముడూ అనే బాంధవ్యాన్ని బాణంలా వదిలి నోరుతెరుచుకు ఎదురు చూస్తున్నారు ... అటువంటి వాళ్ళకు టెలిగ్రాం అందలేదనుకోవటమే సరైన సమాధానం!"

"రాజేశ్వరీ... రాజేశ్వరీ... ఘోరం రాజేశ్వరీ!" ఏఁవీ చేతకాని వాడిలా అరవసాగాడు.

రాజేశ్వరీ ఓ ఛీత్కారం చేసింది! "ఛీ! కృతఘ్నులు!"

* * *

రాత్రి ఎనిమిది గంటలప్పుడు ఆ గ్రామం పక్కగావున్న రోడ్డుమీద చంద్రశేఖరాన్ని బరువైన గుండెలతో దించి, దుమ్ము రేవుకుంటూ ఆ ఎర్రబస్సు వెళ్ళిపోయింది.

నాలుగు ఫర్లాంగుల దూరంలో తన ఊరు మిణుకు మిణుకుమంటున్న దీపాలతో కన్నబిడ్డను కోల్పోయినట్లుగా దిగులుగా కనబడింది.

అది తన ఊరు.

తను పుట్టిన ఊరు.

తను పెరిగిన ఊరు.

నాలుగేళ్ళవయస్సులో తల్లీ తండ్రీ పోగా అన్నీతామే అయి పెంచిన అన్నయ్య వదినలు వున్న ఊరు — ఉఁ హూఁ ... ఇంకెక్కడి అన్నయ్య ? ...

అడుగులు వేస్తుంటే ఏదో కొత్త ప్రదేశంలో నడుస్తున్నట్లే వున్నది ... నిజమే ! తాను ఆ ఊరువచ్చి అప్పుడే పదేళ్ళయింది.

పైనుంచి కురుస్తున్న మంచులో తడిసిన ఆ మట్టిరోడ్డు చచ్చిన శవంలా పడివున్నది. పదేళ్ళకాలంమారినా రూపు మార్చుకోలేని ఆ రోడ్డు తనమీది ఆత్మీయతను వదులుకోలేనట్లుగా కాలి బూట్లను తనలోకి లాక్కుంటోంది. కొత్తగా వచ్చినట్లున్న ఎలక్ట్రిక్ దీపాలు ఈ కొత్త మనిషిని కళ్ళుచిట్లించి చూస్తున్నట్లుగా మసక మసగ్గా వున్నయి.

పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోవటం బాధ అన్నట్లుగా కొత్తగా పక్కగా ఎత్తుపోసిన చెరువుగట్టుమీదుగా నడువసాగాడు చంద్రశేఖరం.

అన్నయ్యలేని ఆ యింట్లో తను కాలుపెడుతున్నాడు.

ఇన్నాళ్ళూ తనని ఈ ఛాయలకు రానీయలేదు రాజేశ్వరి.

డబ్బున్న రాజేశ్వరికీ — బీద వాళ్ళంటే భయం — తను మెత్తటి వాడని, తనని వాళ్లెక్కడ దోచేస్తారోనని - బంధించివేసింది - భార్యా, పిల్లలూ అనే బంధాలతో ఎక్కడికీ కదలనీయకుండా...

ఊరిముందు శివాలయపు ధ్వజ స్థంభం గంటలు ఆ చల్లగాలికి వణుకుతున్నట్లుగా గణగణలాడుతున్నయి.

ఎత్తైన చెరువుకట్టమీదుగా ఆలోచనల ముళ్ళమీద నడుస్తూన్న అతడికి పక్కన లోతుగా చెరువుగట్టు క్రిందగా ఏదో మనుష్యుల అలికిడి ... ఆ పైన 'ఇదీ ప్రపంచం' అన్నట్లుగా ఒక్కసారి మంట ఘుప్పుమన్నది - మరుక్షణం లోనే 'ఈ ప్రపంచాన్నే' చూడలేనట్లుగా ఓ నీళ్ళకుండ ఘొల్లుమన్నది ...

ఇంకెవ్వరిదయివుంటుందా శవం ? ...

- తన అన్నయ్య - తన రక్తంతో రక్తం పంచుకుపుట్టిన తన అన్నయ్య కాలిబూడిదవ్వబోతున్నాడు.

ఆ చెరువు గట్టుమీదుగా తూలుతున్నట్లుగా శ్మశానంలోకి జారిపోయాడు - ఒకటి రెండు అడుగులు స్వాధీనం తప్పుతున్నట్లుగా జారినయి గూడా ...

మసక వెలుతురులో మనుష్యులు దగ్గరయ్యారు. మనిషి కాలుతున్న వాసన దగ్గిరయింది. ఈ చల్లగాలిలో కట్టెలు ముట్టుకోవేమోనని పోసిన

దబ్బాడు కిరసనాయిలూ కోరలుచాచి ఆ కదలలేని మనిషిని కబళించి వేస్తోంది.

వెనక్కు తిరిగి చూడకుండా ముందుకు అడుగులువేస్తున్న పదిహేనేళ్ళ కుర్రవాడు ఎదురుగ్గా ఊగిపోతూ వస్తున్న కొత్త మనిషినిచూచి కలవర పడ్డాడు.

"ఎవరూ అది ... చంద్రశేఖరమా ?" ఆ ఊరి కరణంగారి గొంతు.

"అవును బాబాయ్ ... " గుండెలు మండి తనని భగ్గున కాల్చేస్తుంటే ఇంకా బ్రతికి వున్నందుకే విలపిస్తున్నట్లుగా— పంజరంలో ఏడుపులో చిక్కుపడి పోయి - వినబడీ వినబడకుండా బయట పడ్డాయి తడిసిముద్దయిన ఆ రెండు మాటలూ ...

"ఇదేనా రావటం ?"

అవునన్నట్లుగా తలఊపాడు చంద్రశేఖరం.

తండ్రితలకు కొరివిపెట్టిన సూర్యం ఏడుస్తూ పక్కన నిలబడ్డాడు. బాబాయ్ దగ్గరిగా వచ్చాడు.

చిన్నగా గొణుగుతున్నట్లుగా: "ఇప్పటిదాకా వస్తావనే శవాన్ని వుంచాం ... ఇంకా పీధిలో ఎవ్వరిం ట్లోనూ ఈ రోజుకు పొయ్యిరాజలేదు... అందుకనే నీవు రాకుండానే అన్నీ కానిచ్చేయాల్సి వచ్చింది !" అన్నాడు.

చంద్రశేఖరం గొంతులో ఏడుపు - ఆస్మారోగి కంఠంలో కఫంలా అడ్డు పడింది.

'పది సంవత్సరాలక్రితం ఏనాడయితే ఈ గృహంనుండి బయటకాలు పెట్టానో ఆనాడే చచ్చిపోయాను నేను - అటు వంటి నాకు ఆయన చిరంజీవే !'

శవాన్ని మోసుకువచ్చిన మనుష్యులు తమ పని అయిపోయినట్లుగా చెరువుగట్టంబడే పడి శివాలయంవైపుకు నడుస్తున్నారు... తన నాన్నని బూడిద చేసిన సూర్యం సర్వంపోగొట్టుకొని కృంగిపోతూ తలవంచుకొని వాళ్ళ వెనుకగా అడుగులు వేస్తున్నాడు.

వెనుకగా—

చంద్రశేఖరం, ఆ ఊరి కరణం గారూ ...

నవమిచంద్రుడు అప్పుడే పుడుతున్నాడు.


"ఆయన బ్రతికివుండగా ఒక్కసారి చూచి వెళితే బాగుండేది ... "

"ఏవిటి జబ్బు ? ... నాకు తెలియనే తెలియదు !" లోతైన గొంతు.

"వయస్సు మళ్ళిన మనిషికి జబ్బు ఏదైతేనేం ... నేను ఇక ఎక్కువ రోజులు బ్రతకననే రాశాను గదా !"

"ఎవరికి ?"

"నీకు నేను రెండు ఉత్తరాలు రాశాను ... అందలేదా ?" ఆయన తలెత్తి చంద్రశేఖరం ముఖంలోకి సూటిగా చూచాడు.



అబ్బాం మా అమ్మ వంట లా వుంది - చప్పగ చప్పగా !!!

చంద్రశేఖరం కళ్ళకి మరేమీ కనబడనీయకుండా రాజేశ్వరి అడ్డుగా నిలబడింది ... తన భార్యనే తాను నమ్మలేనప్పుడు పోస్టల్ డిపార్టుమెంటువారిని అనుమానించటం దేనికి ?

అంది. వుండలేదని నిర్ధారణ చేసుకున్న ఆయనకు కారణం గూడా లీలగా ఊహాజనితమయింది.

జాలిగా చంద్రశేఖరాన్ని చూచి తల వంచుకున్నాడు.

శివాలయంపక్క చేదబావి దగ్గర అందరూ స్నానాలు చేసిందాకా అతడూ ఆ లోతైనబావి నల్లటినీళ్ళలోకి చూస్తూ నిలబడ్డాడు.

యింటికి జేరేటప్పటికి పదయింది.

మనిషి చచ్చిన వాసన ఆ యింటిని యింకా వీడనేలేదు. మనస్సు చచ్చిన మనుష్యుల నీడలు ఆ యింటిముందు తారట్లాడుతున్నాయి. ఎవళ్ళో ఆడవాళ్ళ ఓదార్పుమాటలు, వదిన ఏడుపు నడుమ ఎబ్బెట్టుగా వినబడుతున్నాయి.

బుద్ధుడు కైసగౌతమిని చావుఎరుగని గృహంనుండి పిడికెడు ఆవాలు పట్టుకువస్తే చనిపోయిన ఆమె పుత్రుని బ్రతికిస్తానన్నాడట. ఆమెకు జ్ఞానోదయం కలిగించేటందుకే ఆ పరీక్ష పెట్టాడని ఆమెకు చాలా సేపటికి గాని అర్థం కాలేదు - అన్నయ్యలేని ఆన్నీ తెలిసిన వదినను తను ఎలా ఓదార్చగలడు ?

చంద్రుడు మనిషిలేచిన ఆ యింటి మీదకు పాకాడు.

ముందుగా వెళ్ళిన బాబాయి, "చూడు కాంతమ్మా ... చంద్రశేఖరం వచ్చాడు !" అన్నాడు.

ఆమె మరొకసారి ఏడుపును ఆపుకోలేక భళ్ళుమన్నది.

తనను ఎత్తుకున్నది ఆమె. తనకు నీళ్ళుపోసింది ఆమె. తనకు అన్నం పెట్టింది ఆమె. తనకు అన్నం తినిపించింది ఆమె తనని ఇంతవాడిని చేసింది ఆమె.

ఉంహూం...

తనని ఆ చెరసాలకి తోసింది ఆమే ...

ఆమె తనని బంగారు పళ్లెంలో, ముత్యాల పందిరిక్రింద, రత్నాల రాసుల నడుమ ... అమృతాన్ని సేవించమని పంపింది.

ఓ గుడ్లగూబ వికృతంగా అరిచి ఆ యింటిముందున్న బాదంచెట్టు ఆకులను టపటపలాడించింది

చచ్చిన శవంలా ముందుకు నడిచాడు చంద్రశేఖరం.

ఆమె ముందు తలవంచాడు. ఆమె పాదాలమీద తన చేతులువేసి ఆమె ముందు శవంకాలిన బూడిదకుప్పలా జారిపడి 'భోరు' మన్నాడు.

"నన్ను క్షమించు వదినా !"

ఆమె ఏడుపుకు ఆ యింటి పిల్లలు మరోసారి ఏడ్చారు.

"నాయినా ! శేఖరం... నాయినా ... ఆ దేవుడికి నేను ఏం అన్యాయం చేశాను ... ఆయనతోటే నన్నూ ఎందుకు తీసుకువెళ్ళలేదు !" ఆమె కళ్ళు చెరువులయినయి. ఆమె కన్నీళ్ళలో అతడు తడిసిపోయాడు. ఆమె ఏడుపులో అతడి ఏడుపు వినబడనేలేదు ... విడిచిన గుడ్డలమూటలా పడివున్న ఆమె చెక్కులు అతడి గుండెల మీద సమ్మెటపోట్లే అయినయి.

అతడు చచ్చిపోయాడు.

తరువాత ఎప్పటికో కరణంగారి ఓదార్పుమాటలతో చంద్రశేఖరం లేచి చూరుక్రిందగా తలవంచుకొని బయటకు వచ్చాడు.

బాదంచెట్టుక్రింద నులకమంచంమీద కూలబడి - చెట్లఆకుల నడుమ, పంజరంలో చిలకలా చిక్కుకుపోయిన చంద్రుడిని చూస్తూ కూర్చుండిపోయాడు.

"కాసేపు నడుం వాల్చు... పన్నెండు దాటినట్లుంది ... పొద్దున్నే వస్తాను ... కాస్త డబ్బుగూడా చూడాలి !" ఆయన గడపదాటి వెళ్ళిపోయాడు.

ఆయన మాటలు చంద్రశేఖరం ముందు మరోసారి రాజేశ్వరిని కూర్చోబెట్టినయి.


ఆ క్షణాన తను ఎంత అశక్తుడో తనకు తప్ప మరెవ్వరికీ తెలియదు. కనీసం ఈ పదిరోజుల ఖర్చులకైనా తను కొంత పట్టుకువస్తాడని వాళ్ళంతా ఆశించడంలో తప్పేమీలేదు - అంతేగాదు అలా అనుకోవటంలో ఆశ్చర్యమూ లేదు.

కారణం తనను నాలుగేళ్ళ వయస్సునుండి పెంచింది వాళ్ళు ...

ఛీ ! ఛీ ! ఎంత దౌర్భాగ్యపు జీవితం తనది ...

తనే పొరబాటుపని చేశాడు.

ఇంట్లో రాజేశ్వరి తనకు చార్జీలకు తప్ప ఏమీ మిగిల్చి వెళ్ళలేదని తెలిసి




నప్పుడు తెలిసినవారి నెవరినైనా అడిగి నాలుగు వందలు తెస్తే సరిపోయేది.

కాని,

డబ్బున్న తను నాలుగు వందలు మరొకరిని అడగటంలోని ఆంతర్యం ఈ సభ్యప్రపంచంలో ఎన్నో కథలకు పునాదులవుతుంది.

పెళ్ళి కెళ్ళుతున్నానని సెలవు పెట్టటం అందరికీ తెలుసు.

అందుకే తనని తాను చిన్నబరుచుకోవటం యిష్టంలేదన్నట్లుగా బీరువాలో వున్న యాభైరూపాయిలే జేబులో వేసుకు వచ్చేశాడు.

బాధతోనూ, సిగ్గుతోనూ, మనస్సు అంతా మెలికలు తిరిగిపోతోంది.

ఎవరో భోజనం సంగతి ఎత్తితే తలెత్తకుండానే చేసొచ్చానని అబద్ధమాడాడు. ఆ మంచంమీదే మరెవ్వరో దుప్పటి పరిచారు ఎవరో దిండు పెట్టారు . . ఆ మంచంమీదే ఎవ్వరికీ కనబడలేనట్లుగా ముడుచుకు పడుకున్నాడు చంద్రశేఖరం.

అప్పుడప్పుడు ఇంకా వదిన ఏడుపు సన్నగా పేరు తెలియని పక్షికూతలా వినిపిస్తూనేవున్నది. చెట్టుమీద గూడు కట్టుకున్న పక్షులు కదిలినప్పుడు ఆకులు బరువుగా ఊగుతున్నయి.

చచ్చిన మనిషికోసరం చస్తున్న ఈ మనుష్యులను చూడలేనట్లుగా పైనున్న చంద్రుడు చెట్టుచాటుకు తప్పుకుంటున్నాడు.

రాజేశ్వరి తల్లీదండ్రి దగ్గర ఎంత హంగామా చేస్తున్నదో ?

తను రాకపోవటానికి కారణాన్ని కథలల్లి, చిలువలూ పలువలూ జేర్చి— ఓ అభూత కల్పనతో కూడిన అభాండాన్ని తన నెత్తిన రుద్దుతోంటుంది.

తన డబ్బునీ, ఆస్తినీ గూడా తన వాళ్ళకే దోచిపెడుతున్నట్లుగా మాట్లాడి, తన కుటుంబాన్ని సర్వనాశనంచేసి

పిల్లలకు బిప్పలు చేతికిస్తున్నట్లుగా కంట తడిపెట్టి వాళ్ళ సానుభూతిని కొనుక్కుంటుంది.

ఆమెకు అదో తృప్తి!

తనలోని అసమర్థత కళ్ళమీదకు నిద్రను రానీయటంలేదు...రాజేశ్వరి కళ్ళముందు నిలబడి మనిషిని మనిషిగా నిలవనీయటంలేదు.

చచ్చిపోయిన అన్నయ్య తన పిల్లల్ని తన ముందుకు తోస్తున్నట్లనిపిస్తోంది. వరండాలో మూలగా పడివున్న వదిన ఏడుపుతో తన గతాన్ని గుర్తుకు తెస్తున్నదేమో ననిపిస్తోంది.

అన్నయ్య బడిపంతులుగా చేసి మిగిల్చిందేమున్నది— ఈ చవుడు రాలుతున్న మట్టి కొంప తప్ప!

ఆయన మంచి వయస్సులో వున్నప్పుడు పై ట్యూషన్లమీద సంపాదించింది తన చదువులకే అర్పితంచేశాడు. ఒకవిధంగా ఆయన తనమీద వెచ్చించినదంతా బూడిదలో పోసిన పన్నీరే...

ఛీ! ఛీ! ...ఆనాడు దత్తత అనే పేరుతో తనని ఈ యింటినుంచి పంపకుండా వున్నట్లయితే ఈనాడు వాళ్ళకి ఇన్ని కష్టాలు దాపురించేవేగాదు.

—ఇప్పుడు ఏం వను కొని ఏం లాభం?... ఇనుప తెరలు ఆకాశమెత్తున తమ మధ్య అడ్డుగా నిలబడినప్పుడు...

రాజేశ్వరికి తెలియకుండా వీళ్ళకు ఎలాగైనా నెల నెలా కొంత పంపాలి!

ఎలా?...ఎలా?...

నెల నెలా జీతంగూడా కంపెనీవారు బ్యాంక్‌లోనే జమచేస్తారే!

ఏదో ఒకటి ఆలోచించాలి!

ఏదో ఒకటి చేయాలి...

మనిషిగా తను పుట్టినందుకు, మనిషిగా తను బ్రతకగలుగుతున్నందుకు తన అన్నయ్యగారి కుటుంబాన్ని ఆదుకోవటం తన విధి...

ఎక్కడో తలుపు కిర్రుమన్నచప్పుడు ...పాదాల సవ్వడి...భూతమేదో మీది మీదికి వస్తున్నట్లే అనిపిస్తోంది... గుండెలమీద బరువుపడుతోంది...

అన్నయ్య తనని నిలదీస్తున్నాడు?

తన చేతగాని తనాన్ని అసహ్యించుకుంటున్నాడా?

"ఏమిటి శాంతమ్మా! ఇంత రాత్రి పూట కబురంపించావ్?" పదేళ్ళయినా తను గుర్తుపట్టగలడు... అది రంగయ్య గొంతు...పక్కింటి ఆసామి!


"ఇటురా రంగయ్యా!" వదిన ఏడుపు గొంతు.

"చంద్రశేఖరం వచ్చాడటగా..."

"అవును...అడుగో పడుకున్నాడు గాని...ఇటురా...కూర్చో!"

"చెప్పు...ఏమిటి?...

శాంతమ్మ చిన్నగా ఏడుస్తోంది. "చూడు అన్నయ్యా! నాకు చిన్న



సాయం చేసిపెట్టాలి...ఈ గొలుసు తీసుకువెళ్ళి ఎక్కడైనా డబ్బుపట్టు రా... ఈ పదిరోజులూ గడవాలి గదా !"

చంద్రశేఖరం ఉలిక్కిపడ్డాడు, ఆమె చిన్నగా గొణుగుతున్నట్లుగా అన్న మాట లకు—అన్నయ్య తన కాలేజీ చదువు కోసరం ఒకనాడు తాకట్టుపెట్టిన ఆ గొలుసును, తన చావు ఖర్చులకోసరమే విడిపించి తెచ్చుకున్నా దన్నమాట !

చంద్రశేఖరం దుఃఖంలో గుండెలను అదిమిపెట్టుకోసాగాడు. వదిన మాటలు రంపాలయి తనని 'కరకరా' కోసే స్తున్నయి.

రంగయ్య అంటున్నాడు: "అబ్బాయి వచ్చాడుగదా...ఏమైనా తెచ్చాడేమోలే ...తొందరపడబోకు !''

వదిన కష్టపెట్టుకుంటున్నట్లుగా అన్నది: "నా ఇబ్బందులకోసరం అతడిని ఇబ్బందిపెట్టటం దేనికి... తీసుకు వెళ్ళన్నయ్యా...మరో కంటికి తెలియనీయబోకు... !''

"సరే... నీ యిష్టం !'' రంగయ్య తన అడుగులను చంద్రశేఖరం గుండెల మీద వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"వదినా !" దుప్పటి ముసుగు తన్ని మరీ కుళ్ళికుళ్ళి ఏడ్చాడు చంద్రశేఖరం.

అతడి ఏడుపునూ, బాధనూ చూడ లేనట్లుగా చంద్రుడు చెట్టుక్రిందనుండి గూడా జారిపోయి గోడవెనుక దాక్కు న్నాడు.

* * *

పదేళ్ళ క్రితపు తన గతాన్ని చూస్తు న్నట్లుగా—వెలుగుతోపాటు కళ్ళు తెరిచి ఆయింటిని చూచాడు.

అన్నయ్య ముసలివాడైనట్లుగా ఆ యిల్లూముసలిదైపోయింది. ఆగృహంలో, ఆ మనుష్యుల నడుమ ప్రతి క్షణం తన ప్రాణానికి కత్తెరే అవుతుం డగా అక్కడ నిలవలేడేమోననిపిం చింది.

అందుకే ముఖం కడుక్కొని స్నానం చేసి గుడ్డలు మార్చుకున్నాడు.

వదిన దగ్గరిగా వెళ్ళి తప్పుచేసిన వాడిలా తలవంచుకు కూర్చున్నాడు.

రాత్రి చీకటి తెరలు కొంతవరకు

అతడిని ఆమెరూపాన్ని చూడకుండా చేసినయి. కాని వెలుగు సిగ్గువిడిచి వాళ్ళ మధ్య నిలబడింది.

ఆమె ముఖంలోకి ఒక్క-క్షణమే చూచాడు. క్రితంసారి ఆమెను చూచినప్పటికీ,ఇప్పటికీ ఆమెలో చాలామార్పు కనబడుతుంది. ముఖం మరింత ముడతలు పడటమే గాకుండా, జుట్టులాగానే తెల్లబడిందిగూడా. కళ్ళక్రింద క్రొత్తగాఏర్పడిన నల్లటి మచ్చలు ఆమెలోని బాధలను బహిర్గతం చేస్తున్నాయి.

"నేను వెళ్ళిపోవాలి వదినా.. ఇవాళ రాత్రికే ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళిపోవాలి!"

అర్భకుడి మనస్సు ఆబద్ధాలపుట్ట!

"పిడికెడు అన్నంగూడా వండిపెట్టలేకపోయాను నాయనా!" ఆమె కళ్ళు చెరువులయినయి. ఆమె మరిది చేతిని ప్రేమగా, సానుభూతితో స్పృశించింది.

"వీలయినంత త్వరలో మళ్ళీవస్తాను, వదినా!"

"మంచిది నాయనా!" అన్నది చెంగును ముఖంమీదకు లాక్కుంటూ.

ఇక ఆక్కడ వుండలేకపోయాడు చంద్రశేఖరం. సిగ్గుతో కుంచించుకుపోతూ ఆ గదిలోనుంచి బయటపడ్డాడు. సూర్యం గ్లాసుతో కాఫీ అందిస్తే,చేతుల్లేని కుర్చీలో శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు.

అతడికి ఛటుక్కున ఓ ఆలోచన వచ్చింది.

కళ్ళు తళుక్కుమన్నాయి.

చేతిలోవున్న కాఫీ గ్లాసును పక్కనే వున్న టేబుల్‌మీద పెట్టి, దానిమీదవున్న నోటుపుస్తకంలోనుంచి ఓ కాగితం చించాడు. అక్కడేవున్న పెన్సిల్‌తో దబదబా ఇలా రాయసాగాడు.

"వదినా,

అసమర్థతకు మారురూపమే నేను. నన్ను ఇంతచేసిన అన్నయ్యకు నేనుఏమీ చేయలేకపోయాను.

నన్ను మన్నించి ఈ చిన్నవస్తువునైనా ఈ అవసరానికి ఉపయోగించి నన్ను తృప్తిపరుచు.

నన్ను అపార్థం చేసుకోబోకు.


—చంద్రశేఖరం."

ఆ కాగితాన్ని మడతపెట్టి ఆ టేబుల్ మీదపెట్టాడు. తన చేతివేలికున్న వజ్రపు టుంగరాన్ని తీసి దానిమీద పెట్టాడు

ఆ గ్లాసులో మిగిలిన కాఫీని గూడా త్రాగకుండా బిగుసుకుపోయి బ్రీఫ్‌కేస్‌తో బయటకు నడిచాడు. వెనుక ఎవ్వరో తరుముతున్నట్లుగా వడివడిగా అడుగులు వేయసాగాడు.

తన వదిన ఆ వుంగరాన్ని, ఉత్తరాన్ని చూసేలోగా త సీఊరు దాటాలి..

తనలోని సిగ్గును, అసమర్థతని ఏదో తృప్తి జయించింది. తనకు చివరి క్షణాలలో వచ్చిన ఇంత అమోఘమైన ఆలో




చనకు తనని తాను అభినందించుకున్నాడు.

ఆ వీధి దాటాడు. ఊరిబయట పూరి గుడిసెలు దాటాడు. చెరువుగట్టుమీదనున్న మర్రిచెట్టు దాటాడు. మర్రిచెట్టు పక్కన—తను చిన్నప్పుడు ఆడుకున్న శివాలయం దాటాడు.

మనిషిని తెలియని తృప్తి ఆనందం—రాజేశ్వరి మీద సాధించిన విజయంలా ఉప్పొంగిపోతున్నయి.

చెరువు గట్టుమీద గాలిలో తేలిపోతు న్నట్లుగా నడుస్తున్నాడు. చెరువు గట్టు క్రిందగా శ్మశానంలో బూడిద కుప్పయిన అన్నయ్య తనని పంపటానికి వస్తున్నట్లే అనిపించేలా కనిపించాడు.

కళ్ళు చమర్చినయి. కాళ్ళు తడబడినయి. మనస్సు కలుక్కుమన్నది.

చెరువుగట్టు పొడుగు చిన్నదయింది. ట్రంకురోడ్డు దగ్గరయింది. రోడ్డు పక్కనున్న పత్రం అడుక్కునేదాని బోర్లించిన సత్తుచిప్పలావున్నది. దాని ముందంతా రాలి ఎండిన ఆకులు అనాధ ప్రేతాన్ని పీక్కుతింటున్న చీమల్లా వున్నాయి. పక్కనేవున్న బావిముందు నీళ్ళరొచ్చు రాజేశ్వరి హృదయంలా అసహ్యంగా వున్నది.

పొడుగ్గావున్న సిమెంటురోడ్డు అన్నయ్య మనస్సంత విశాలంగావున్నది. దానికి అటూయిటూ పచ్చగావున్న చెట్లు వదిన హృదయంలో చల్లటినీడ నిస్తున్నయి. దూరంగా ఎర్రటి బస్సు—అన్నయ్యగారి యింటినుండి బయల్దేరే ముందు తనకు వచ్చిన ఆలోచనకు కలిగించినంత ఆనందాన్ని కలిగించింది.

బస్సు మరీ మరీ దగ్గరవుతుంటే అతడు రోడ్డుమీదకే ఆత్రంగా రెండడుగులు వేసి చేయెత్తాడు ఆపమన్నట్లుగా.

ఆ బస్సు అంత స్పీడులోనూ అతడిని మళ్ళా వెనక్కు—మొదట నిల్చున్న స్థలానికే నెడుతూ— అతడిముఖాన దుమ్ముకొడుతూ ఆగుతుంటే— దాని తలుపును అందుకోవటానికి చిన్నపరుగు లాంటి ప్రయత్నం చేయవలసి వచ్చింది

"బాబాయ్! నీవు డ్రాయరుమీద ఉంగరాన్ని మర్చిపోయావుట... అమ్మ యిచ్చి రమ్మన్నది!" తన అన్నయ్య చిన్న కొడుకు తను రాసిన కాగితాన్నీ, ఉంగరాన్నీ చేతిలోకుక్కి తను కలవరపాటునుండి కోలుకునేలోగానే బస్సును మించిన వేగంతో తుర్రుమన్నాడు.

చంద్రశేఖరం తన చేతిని చూచుకుంటూ అవాక్కయి అక్కడే నిలబడిపోయాడు.

"అరేయ్!" అర్థంలేని కేక.

"త్వరగా ఎక్కండిసార్!" కండక్టర్ అరుపు.

రక్తం పిండేయగా కాళ్ళు జారిపోతున్నాయి. నల్లబడిపోయిన మొఖంతో ఏమీ చేతగాక శరీరాన్ని బస్సులోకి జేరవేశాడు.

చేతిలోని కాగితం నిప్పులా కాలుతోంది.

కాగితం చదవకుండానే తను నిజంగానే మర్చిపోయాడేమోనని పంపినట్లున్నది. తను అసమర్థుడు అని మరో సారి ఋజువయింది. కాగితం మడవకుండా తెరిచి వుంచినా చదివేదేమో!

చేతివేలికి ఉంగరాన్ని దూర్చి తాను రాసిందే మరోసారి చదువుకుందామా అన్నట్లుగా మడత విప్పాడు.

అక్కడా మరో ఓటమి!

అది రాసింది తన వదిన..

"నాయినా చంద్రశేఖరం,

నీ మనస్సులోని మామీది ఆత్మీయత విలువ కట్టలేనిదయ్యా . ఎందుకు దానిని ఇంత చిన్న వస్తువతో పోల్చి తేలిక పరుస్తావ్.. వద్దు నాయినా!

నన్ను మన్నించు

—నీ వదిన."

